క్లుప్తంగా

అక్టోబర్ 3 నుంచి దసరా ఉత్సవాలు


అమ్మవారి ఆలయంలో ఉత్సవాలకు పందిరి రాట పాతుతున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మెంటే వారి తోటలోని శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో దసరా ఉత్సవాల ప్రారంభ పందిరి రాట ముహూర్తాన్ని గురువారం ఉదయం 9.30 నిమిషాలకు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి 12 విజయ దశమి వరకు అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సమతం తాతాజీ, మురళీ, ఏడిద సుబ్బారావు, చవ్వాకుల శివ, తదితరులు పాలొంగన్నారు.

వంట సామగ్రి అందజేత


అగ్ని ప్రమాద బాధితులకు వంట సామగ్రి అందిస్తున్న దృశ్యం

భీమవరం: మండలంలోని వడ్డిగూడెంలో అగ్ని ప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం వంట సామగ్రి అందించినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. అగ్ని ప్రమాదంలో నేపాల బ్రహ్మం ఇల్లు దగ్ధమయ్యి వారి కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారని దీంతో రెడ్ క్రాస్ జిల్లా శాఖ చైర్మన్ శివరామభద్రరాజు ఆదేశాలతో సంస్థ తరపున వంట సామగ్రి, టార్పాలిన్, హైజీన్ కిట్స్‌ను అందించినట్లు రెడ్ క్రాస్ సీనియర్ లైఫ్ మెంబర్ గోపిశెట్టి మురళీకృష్ణారావు, కోఆర్డినేటర్ ఎస్.మల్లేశ్వరరావు తెలిపారు.

నేడు యూపీఏ సమావేశం

పాలకోడేరు: మోగల్లులోని గోపే జయలక్ష్మి ఇంటి వద్ద పాలకోడేరు మండల పాస్టర్ల అసోసియేషన్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించినట్లు యూపీఏ ప్రెసిడెంట్ గోపే సాల్మన్ రాజు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విశాఖపట్నం నుంచి ప్రసంగీకులు పి.అనిల్‌కుమార్ పాల్గొని ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలు చేశామని వివరించారు.

సమస్యలు పరిష్కరించాలి


మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్‌వీకే నాగేశ్వరరావు, బోనం పాండురంగారావు మాట్లాడుతూ పట్టణంలోని డ్రైనేజీల్లో చెత్తను ప్రతీ రోజు తీయకపోవడం వలన మట్టి పేరుకుపోయి మురుగు నీరు రోడ్లపైకి వస్తుందన్నారు. కార్యక్రమంలో మట్లపూడి సత్యనారాయణ, తాళ్లపూడి గాంధీ, పెన్మెత్స రామకృష్ణంరాజు, దిరిశాల సత్యనారాయణమూర్తి, కట్రెడ్డి సత్యనారాయణ, మలిశెట్టి సాయిబాబా, ఇంటి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం


తుందుర్రులో సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: మండలంలోని వెంప, శ్రీరామపురం, పెదగరువు, తుందుర్రు గ్రామాలలో శుక్రవారం శ్రీ విష్ణు ఫార్మసీ కళాశాల విద్యార్థులు నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్), ఉన్నత భారత అభిమాన్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఇంటింటికీ తిరిగి పరిసరాల పరిశుభ్రత గురించి గ్రామస్తులకు వివరించారు. తుందుర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధ్యాపకులు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి సాయం

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రుకి చెందిన క్యాన్సర్ రోగి గుమ్మాపు రామకృష్ణకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు రూ.10 వేల ఆర్థిక సహాయం ప్రకటించారు. ఈ సహాయాన్ని కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు గురువారం చింతపర్రులో రోగికి అందజేశారు. పేద, మధ్య తరగతి వర్గాలకు విద్య, వైద్యం నిమిత్తం కోట్లాది రూపాయలు సహాయం చేస్తున్నారని బుద్ధరాజు వివరించారు.

అంగరంగ వైభవంగా గణనాథుడి నిమజ్జనం

ప్రత్యేక పూజలతో సాగనంపిన భక్తులు

ఆకివీడు: వినాయక చవితి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద లక్ష్మీ గణపతి పూలు, పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. సన్నాయి మేళం, డప్పు వాయిద్యం, డీజే సౌండ్ సిస్టంతో ఊరేగింపు కొనసాగింది. స్థానిక వాడపల్లి వారి వీధిలోని భుజబలరాయుడు చెరువు గట్టు వద్ద వేంచేసిన వినాయక ఆలయం వద్ద ప్రత్యేక మండపంలో నిర్వహించిన చవితి ఉత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి, స్వామివారిని ఊరేగించారు. అనంతరం వెంకయ్య వయ్యేరు పంట కాలువలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పూలు పండ్ల వర్తక సంఘం సభ్యులు, అగస్త్య యూత్ సభ్యులు పాల్గొన్నారు.


భారీ వినాయకుణ్ణి నిమజ్జనం చేసేందుకు ఊరేగిస్తున్న దృశ్యం


వినాయకుడి మట్టి ప్రతిమకు జలాభిషేకం చేస్తున్న మహిళలు

వినాయక మట్టి ప్రతిమకు జలాభిషేకం

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక రెస్ట్‌హౌస్ రోడ్‌లో వినాయక మట్టి ప్రతిమకు జలాభిషేకం, మహిళలు కలశాలు చేపట్టి ఊరేగింపు నిర్వహించారు. రెస్ట్ హౌస్ రోడ్‌లోని గంగానమ్మ ఆలయం నుంచి 100 మందికి పైగా మహిళలు గంగాజలాన్ని కలశాలతో, సన్నాయి వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి మట్టి వినాయకుడిని అదే ప్రాంతంలో నిమజ్జనం చేశారు. ఆ మట్టిని భక్తులు స్వీకరించి తమ పంట పొలాల్లో, చెరువులు వెయ్యడానికి తీసుకెళ్లారు. నిమజ్జనం పేరిట నూతనంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో ఆకర్షణయంగా, భక్తి భావంతో నిర్వహించారు. రెండు సంవత్సరాలుగా ఇదే విధంగా నిమజ్జనం చేస్తున్నామని గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. విజ్జురోతి రాఘవులు, వాల్మీకి బాలాజీ, వాల్మీకి అప్పారావు, రామిరెడ్డి రాజేంద్ర, ముసలి పెద్దిరాజు, సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టర్ పర్యటన

ఉండి: స్థానిక గణపవరం రోడ్డులో శుక్రవారం ఉదయం 8:30 గంటలకు పంట కాలువగట్టుపై మొక్కలు నాటే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రారంభిస్తారని ఎంపీడీవో ఎస్.రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాల్గొంటారని వివరించారు.

ఎన్ఎంఎంఎస్ దరఖాస్తుకు 24 తుది గడువు

భీమవరం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తుకు ఈ నెల 24 వరకు అవకాశముందని జిల్లా విద్యాశాఖాధికారిణి జి.నాగమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలు, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షల లోపు ఉండాలన్నారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టే మహా యజ్ఞం

ఘనంగా స్వచ్ఛతా హీ సేవ ప్రచార ర్యాలీ

భీమవరం: చెత్త నుంచి సంపద సృష్టించే విధానాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో ఒక మహాయజ్ఞంలా చేపడితే కాలుష్య నివారణకు దోహదపడుతుందని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. గురువారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కాలుష్య నివారణపై ప్రచార ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జగపతిరాజు మాట్లాడుతూ చెత్త నుంచి సంపద సృష్టించే పరిశ్రమలు స్థాపించి పలు ఉత్పత్తులు మార్కెట్‌లోకి వస్తున్నందున వాటిని ప్రభుత్వం ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్.కృష్ణ చైతన్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్‌పీఎస్ ఆచార్యులు, సీహెచ్‌జీఎన్ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ప్రచార ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

భీమవరం అర్బన్: విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో మెలిగి ఉన్నత ఆలోచనలతో విద్యను అభ్యసించాలని ఎస్ఆర్‌కేఆర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు అన్నారు. భీమవరం మండలంలోని చినఅమిరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో హ్యూమన్ వాల్యూస్ అండ్ ఎథిక్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జి.శశికళ, డాక్టర్ ఎస్‌కేవీఎస్‌టీ లవకుమార్, ప్రధానోపాధ్యాయురాలు వి.అనురాధ, జి.శ్రీసత్య, చింతపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల పరిశీలన

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని స్థానిక 30వ వార్డు నందు మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా తగు సూచనలు జారీ చేశారు. వార్డు పరిధిలో ఏ విధమైన శానిటేషన్‌కు సంబంధించి ఏ విధమైన చెత్తను వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలని కమిషనర్ తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ తో పాటు సానిటరీ ఇన్‌స్పెక్టర్ చంటిబాబు, మలేరియా ఫీల్డ్ అసిస్టెంట్, రామలింగేశ్వరరావు వార్డ్ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతుల్లో నాణ్యత కరువు

భీమవరం: కూటమి ప్రభుత్వ హయాంలో కొత్త రోడ్లు నిర్మాణం ఎలా ఉన్నా మరమ్మతులు చేసిన రోడ్లకు నెల గడవక ముందే తిరిగి మరమ్మతులు చేస్తున్న విచిత్ర పరిస్థితి నెలకొంది. నాణ్యత అంటూ ప్రగాల్భాలు పలికే నాయకుల ఏలికలో రోడ్ల నిర్మాణంలో నాణ్యత ఏపాటిదో కళ్లకు కట్టినట్లు కనబడుతోందని పెద్ద ఎత్తున విమర్శలు విన్పిస్తున్నాయి. భీమవరం నుంచి పాలకొల్లు వెళ్లే నేషనల్ హైవే రోడ్డు ఛిద్రం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు మరమ్మతులు చేయాలని ప్రజలు ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకోవడంతో ఎట్టకేలకు నెల రోజుల క్రితం జాతీయ రహదారికి మరమ్మతులు చేయించారు. రోడ్డు నిర్మాణంలో కనీస నాణ్యత పాటించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు అనేక చోట్ల రోడ్డు చిట్లిపోయి గుంతలు పడడం ప్రారంభించింది. దీంతో రోడ్డుకు తిరిగి మరమ్మతులు చేయడానికి గుంతలు తీయడం ప్రారంభించారు. మరమ్మతులు చేసిన రోడ్డు మూన్నాళ్ల ముచ్చటగానే నిలవగా మరమ్మతులు చేయడానికి తీసిన గుంతలు చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.


రహదారి మరమ్మతులకు గోతులు తవ్విన దృశ్యం

వ్యాయామంతో మధుమేహం నియంత్రణ


ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: వ్యాయామ చేస్తూ జీవన విధానం మార్చుకుంటే షుగర్ వ్యాధి అదుపులో ఉంటుందని ప్రముఖ షుగర్ వ్యాధి వైద్య నిపుణులు ఎస్‌వీ స్వామి అన్నారు. గురువారం ఉండి లయన్స్ ఆడిటోరియంలో లయన్స్ క్లబ్, ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోగులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వామి రోగులకు షుగర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ షుగర్ రావడానికి అనేక కారణాలు ఉన్నాయని, వ్యాయామం చేయడం వలన ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు, ఐక్య ఫౌండేషన్ అధ్యక్షుడు అచారి, దేవుడు రామరాజు, రుద్రరాజు నరసరాజు, కాగిత మహంకాళి, బి.హరనాథరాజు, పెన్మత్స జగన్నాథరాజు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రోగ నిరోధక శక్తి

ఆకివీడు: పోషకాలు గల ఆహారం తీసుకోవడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని స్థానిక అర్బన్ హెల్త్ వైద్యులు వెంకటపతిరాజు అన్నారు. స్థానిక సచివాలయం-4 పరిధిలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆకుకూరలు, మాంసకృతులు, చేపలు వంటివి భుజించాలన్నారు. దీని వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వెంకటపతిరాజు సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా సంబరాలు

ఆకివీడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు మండలంలోని సిద్దాపురం జెడ్పీ స్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తామని మండల క్రీడా సమన్వయకర్త, పీఈటీ జి.మోహన్ బుధవారం చెప్పారు. అండర్-14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చదరంగం, యోగా, షటిల్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్‌లో పోటీలు నిర్వహిస్తారన్నారు. అండర్-14 విభాగంలో పాల్గొనే బాల బాలికలు 1.1.2011 తర్వాత జన్మించిన వారై ఉండాలని, అండర్-17 విభాగంలో పాల్గొనే వారు 1.1.2008 తర్వాత జన్మించిన వారై ఉండాలన్నారు.


చెస్‌లో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు

దేశానికి రైతు పెద్దన్న

పాలకొల్లు అర్బన్: దేశానికి అన్నం పెట్టే రైతన్న పెద్దన్నలాంటి వాడని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు పరిమి వెంకట రాఘవులు అన్నారు. పాలకొల్లు మండలం భగ్గేశ్వరంలో గురువారం భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా మహా సభ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు గంటా నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో వెంకట రాఘవులు మాట్లాడుతూ రైతులకు, కౌలు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలిచ్చి ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలకు అతీతంగా రైతు సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. రాష్ట్ర ఆర్గానిక్ ప్రముఖ్ భూపతిరాజు రామకృష్ణంరాజు మాట్లాడుతూ అధిక వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన అన్ని రకాల పంటలకు సంబంధించి రైతులు, కౌలు రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వరద బాధితులకు విరాళాలు

భీమవరం (ప్రకాశంచౌక్): శాఖ పేరును సార్థకం చేస్తూ విజయవాడ వరద బాధితులకు సహకారం అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టర్ చదలవాడ నాగరాణిని జిల్లా, డివిజన్ సహకార శాఖ అధికారులు, సహాయ రిజిస్ట్రార్లు కలిసి రూ.6,05,053 డిమాండ్ డ్రాఫ్టును విజయవాడ వరద బాధితుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కో-పరేటివ్ అధికారి ఎం.నాగరాజు, డీఎల్‌సీవో కె.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు రాందాసు, హనుమంతరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


కలెక్టర్ నాగరాణికి విరాళం అందజేస్తున్న కో-ఆపరేటివ్ సహకార సంఘాల అధికారులు

ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది విరాళం

గురువారం కలెక్టరేట్ చాంబర్‌లో కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి పాలకొల్లు ఎంపీడీవో సంఘాని వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది కలిసి రూ.59,300 వరద బాధితులకు విరాళం నిమిత్తం డీడీని ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు.

పలువురి దాతృత్వం

భీమవరం: మండలంలోని నర్సింహపురం సర్పంచ్ ఇందుకూరి ఆంజనేయరాజు రూ.2 లక్షలు, కొవ్వాడకు చెందిన అల్లూరి వెంకట సత్యనారాయణరాజు, రామకృష్ణంరాజు రూ.1లక్ష, భీమవరం పట్టణానికి చెందిన అభిరుచి కృష్ణంరాజు, వంశీ, విజయ్‌రాజు రూ.1లక్ష, ది భీమవరం జనరల్ మర్చంట్ అసోసియేషన్ రూ.60 వేలు అందజేశారు. వీరవాసరం మండలం కొణితివాడ గ్రామానికి చెందిన యరకరాజు హరిహరరాజు రూ.1లక్ష, గోపాలకృష్ణ రూ.50 వేలు, భీమవరం 12వ వార్డు అక్షర ఎస్ఎల్ఎఫ్ డ్వాక్రా సీఆర్పీలు రూ.20 వేలు అందించారు.

విద్యాశాఖ విరాళం

భీమవరం: విజయవాడ వరద బాధితులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రూ.8,53,768 విరాళాన్ని గురువారం కలెక్టర్ నాగరాణికి అందజేశారు. ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులు, ఉప విద్యాశాఖాధికారులు, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు ఈ మొత్తాన్ని సేకరించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

భీమవరం అర్బన్: విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడల్లో రాణించాలని సర్పంచ్ జుత్తిగ కనకదుర్గా వర ప్రసాద్ అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరులో డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మండల స్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్స్ సెలక్షన్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జుత్తిగ కనకదుర్గా ప్రసాద్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు దేహ దారుఢ్యం పెరుగుతుందన్నారు. అనంతరం కబడ్డీ, కోకో, చెస్, యోగ, వాలీబాల్, జంప్స్, అండ్ త్రోస్, పరుగు పందెం, షాట్ పుట్, డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, లాంగ్ జంప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 400 మంది విద్యార్థులు, 20 మంది వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ సుంకర పరమేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు, మండల కో ఆర్డినేటర్ జి.నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.


అనాకోడేరు హైస్కూల్‌లో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ జుత్తిగ కనకదుర్గా వర ప్రసాద్

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రభుత్వ సంస్థలను సొంత ఆస్తిగా భావించి పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, లక్షలాది మంది ప్రయాణించే రైల్వే స్టేషన్‌లో పరిశుభ్రత పాటించాలని భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక, భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ సంయుక్త ఆధ్వర్యంలో టౌన్ రైల్వే స్టేషన్ వద్దనలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. రైల్వే కమర్షియల్ గూడ్స్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్, రైల్వే ఆర్‌పీఎఫ్ సీఐ దస్తగిరి, ఏఎస్సైలు, పారిశుద్ధ్య కార్మికులు, ప్లాట్‌ఫాంలను శుభ్రం చేశారు.

వేసవిని తలపిస్తున్న ఎండలు

ఆకివీడు: వాతావరణంలో పెను మార్పులతో ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. గత రెండు రోజులుగా ఇదే వాతావరణం ఉండటంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. జనం రోడ్డు మీదకు రావడానికే భయపడుతున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు అల్లాడిపోతున్నారు. వాతావరణంలో తేమ శాతం భారీగా తగ్గిపోవడంతో గాలి వీచినా వేడుగాలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో కూడా ఇటువంటి ఎండలను చూడలేదని, ఉక్కబోత వాతావరణం బెంబేలిస్తుందంటున్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఉండి: మండలంలోని మహదేవపట్నం ఉత్తరపాలెం ప్రాంతంలో పేకాడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై నసీరుల్లా తెలిపారు. వారి వద్ద రూ.5800 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: ఈ నెల 20వ తేదీ శుక్రవారం 220/33 కేవీ విద్యుత్ కేంద్రం ఆకివీడు పరిధిలో గల 33 కేవీ లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) పీర్ అహ్మద్ ఖాన్ గురువారం తెలిపారు. ఈ మేరకు కాళ్ల మండలం లోని కాళ్ల, దొడ్డనపూడి, కాళ్ళకూరు, కోలనపల్లి, జువ్వలపాలెం, ఏలూరుపాడు పాతళ్ళమెరక గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాలకోడేరులో

పాలకోడేరు: మండలంలోని గొరగనమూడి సబ్‌స్టేషన్ వద్ద 11 కేవీ కొండేపూడి ఫీడర్, మోగల్లు సబ్‌స్టేషన్‌లోని వశిష్ట ఫీడర్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మలను తొలగించే నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున పెన్నాడ, మోగల్లు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

భీమవరంలో

భీమవరం: పట్టణం తహసీల్దార్ కార్యాలయం ఏరియాలోని 33/11 కేవీ ఇండోర్ విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో 11 కేవీ లైన్స్‌పై చెట్లు కొమ్మలు తొలగించడానికి ఈ నెల 20న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప విద్యుత్ ఉప కేంద్ర పరిధిలో శుక్రవారం 11 కేవీ విద్యుత్ హైటెన్షన్ వైర్లపై చెట్లు, కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతుల నిమ్మిత్తం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ గురువారం తెలిపారు.

ఆకివీడులో

ఆకివీడు: ఈ నెల 20న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకివీడులోని 33 కేవీబై 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పనులు నిర్వహణ, దారిలో ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ పీర్ అహ్మద్‌ఖాన్ కోరారు.